# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. దేశాన్ని విధానపరంగా బలోపేతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్య భూమిక పోషిస్తారన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

2. పూర్వోదయ, సాస్కీ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకారం అందించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరిన ముఖ్య మంత్రినారా చంద్రబాబు నాయుడు.

3. ఉమ్మడి గోదావరి జిల్లాలకు రక్షిత మంచి నీటిని అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును రేపు ప్రారంభించనున్న ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్

4. రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందన్న సూక్ష్మ, చిన్న మధ్య, తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

==========================

దేశాన్ని విధానపరంగా బలోపేతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్య భూమిక పోషిస్తారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఈ రోజు నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరమని దీనిలో అత్యంత పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగాలకు ఎన్నికైన వారు దేశాభివృద్ధికి, అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని రాష్ట్రపతి పేర్కొంటూ,

వాయిస్ 19 సెకన్లు

--------------------------

రాయలసీమను ఉద్యాన వన పంటల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రానున్న బడ్జెట్ లో నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను కోరారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి కేంద్రమంత్రితో ఈ రోజు సమావేశమయ్యారు. పూర్వోదయ, సాస్కీ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ కు చేయూత ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే పూర్వోదయ పథకం వికసిత్ భారత లక్ష్యాన్ని చేరుకునేందుకు, జాతీయ ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల లాంటి కీలకమైన రంగాల్లో పూర్వోదయ నిధులు అందించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక

సహాయం–సాస్కీ కింద రెండో విడత నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు

---------------------------

రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత కీలక అంశమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఈ రోజు సమావేశమయ్యారు. పోలవరం సహా రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్రమంత్రితో చర్చించారు. విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, అపరిష్కృత అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అనంతరం కేంద్రమంత్రి సమావేశ వివరాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులకు వివరిస్తూ..

వాయిస్ 32 సెకన్లు

---------------------------

మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. విజయవాడ లోక్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో ఈ రోజు జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత సాయుధ దళాలకు భారతీయులందరి హృదయాలలో ఒక ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న జరుపుకునే సాయుధ దళాల పతాక దినోత్సవం వారి శౌర్యం, విధి పట్ల అంకితభావాలను స్మరించుకునే ఒక ప్రత్యేక సందర్భంగా అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం, సైనిక సంక్షేమ శాఖ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాయని తెలిపారు.

---------------------------

విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్‌ల సాధికారతకు వారి నైపుణ్యాభివృద్ధికి ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్‌ల ఆన్లైన్ నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని దృశ్య మాధ్యమం విధానంలో అమరావతి సచివాలయం నుంచి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి నైపుణ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. అలాగే పోటీ పరీక్షలకు అవసరమైన పాఠ్యాంశాల బోధనతో పాటు డిజిటల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై శిక్షణ అందిస్తామని తెలిపారు. ట్రాన్స్ జెండర్‌లకు ఫించన్లతో పాటు గుర్తింపు కార్డులు ,రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఉమ్మడి గోదావరి జిల్లాలకు రక్షిత మంచి నీటిని అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ రేపు ప్రారంభించనున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని పెరవలి గ్రామంలో ఉపముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను మంత్రి నిన్న పరిశీలించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో జల్‌జీవన్ మిషన్ నిధులుతో చేపటనున్న నిర్మాణాలకు వాటర్ గ్రిడ్ కు భూమిపూజ చేసి అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఈ సందరరేగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని సూక్ష్మ, చిన్న మధ్య, తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమం “ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త”కు అనుగుణంగా రాష్ట్రంలోని అనంతపురం, విజయనగరంలలో ఎంఎస్ఎంఈ విస్తరణ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ విస్తరణ కేంద్రాల ఏర్పాటు ద్వారా సాంకేతిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, ఇంక్యుబేషన్, కన్సల్టెన్సీ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తద్వారా ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలియజేశారు. అలాగే కొత్త సంస్థల ఏర్పాటును ప్రోత్సహించి, స్థానిక ఉపాధిని కూడా సృష్టిస్తాయని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం విద్యార్థిని గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ కు ఎంపికైయ్యారని విద్యాలయ ఉపకులపతి అల్లం శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరులో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా జరిగే పరేడ్‌కు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ విద్యార్థిని స్నేహ భవాని ఎంపికైయ్యారని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వరుసగా విక్రమసింహపురి విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థులు ఈ పరేడ్‌కు ఎంపిక కావడం గర్వకారణమని ఆయన తెలియజేస్తూ...

వాయిస్ 27 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న 4 రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు.

=====================